ప్రజాశక్తి

శుక్రవారం 26 జులై 2024 5

శ్రీ సత్యసాయి







పెనుకొండ జగన్న కాలనీలో నకిలీ పట్టాలతో నిర్మించిన పునాదులు

ప్రభుత్వ స్థలాల్లో .. భూచోళ్లు..!


- యథేచ్ఛగా నకిలీ పట్టాల సృష్టి
- పట్టాకు రూ.50వేల నుంచి రూ.లక్ష వసూలు
- రెవెన్యూ రికార్డుల్లో నమోదు కాని వైనం
- ఓవైపు ఇళ్లు లేని పేదల పోరాటం.. మరో వైపు నకిలీల మోసం

ఇళ్లు లేని పేదలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు పట్టాలు మంజూరు చేసి కాలనీలను ఏర్పాటు చేస్తోంది. దీనిని అవకాశంగా తీసుకున్న కొందరు అవినీతి పరులు నకిలీలకు తెరలేపారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయ నేతలు అక్రమాలకు తెరలేపి భూచోళ్లుగా మారారు. ప్రభుత్వాలు పేదలకు పట్టాలు మంజూరు చేసిన స్థలాల్లో నకిలీ పట్టాలు సృష్టించి యథేచ్ఛగా విక్రయించి లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారు. గుడి,బడి పార్కు వంటి భవిష్యత్తు అవసరాలకు కోసం కేటాయించిన స్థలాలను అక్రమిస్తున్నారు. పెనుకొండలో అవినీతి భూ పట్టాల వ్యవహారం మూడుపువ్వులు.. ఆరుకాయలు అన్నట్లు కొనసాగుతోంది. రాజకీయంగా నిత్యం విమర్శలు చేసుకునే టిడిపి, వైసిపి నాయకులు అవినీతి వ్యవహారంలో మాత్రం ఒక్కటైపోతున్నారు. గతంలో పెనుకొండలో పని చేసిన తహశీల్దార్ల సంతకాలతో నకిలీ పట్టాలు సృష్టించి స్థలాను అమ్ముకుని దోచుకుంటున్నారు.





ప్లాటునెంబర్ వేయకుండి ఇచ్చిన పట్టా



రెవెన్యూ రికార్డుల్లో నమోదు కాని పట్టా

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ నగర పంచాయతీలో సర్వేనెంబర్ 228-2, 262, 263లో 28.32 ఎకరాల్లో అప్పటి వైసిపి ప్రభుత్వం జగనన్న కాలనీ ఏర్పాటు చేసింది. ఈ కాలనీలో 1004 మంది పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చి, ఇళ్లను మంజూరు చేసింది. ఈ లేఅవుట్‌లో అహుడా నిబంధనల ప్రకారం అన్‌లైన్‌లో ఒక్కొక్కరికి ఒకటిన్నర సెంటు ప్రకారం స్థలం పట్టాలను లబ్ధిదారులకు అందించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లేఅవుట్‌లో 10శాతం స్థలం ప్రజా అవసరాలకు రెవెన్యూ అధికారులు కేటాయించారు. లేఅవుట్ తయారుచేసే సందర్భంలో అక్కడక్కడ ఖాళీ స్థలా లనూ వదిలేశారు. పెనుకొండ సమీపంలో కియా పరిశ్రమ రావడంతో ఇక్కడ స్థలాలకు రేట్లు పెరిగాయి. దీంతో అక్రమార్కులు ఖాళీ స్థలం కనబడితే దానిని ఏదో ఒక రూపంలో నొక్కేసేలా కుట్రలు చేస్తున్నారు. కొందరు వైసిపి, టిడిపి మద్దతుదారులు నకిలీ పట్టాల సృష్టించి స్థలాలు అమ్మకాలు చేస్తూ పెద్ద వ్యాపారం కొనసాగిస్తున్నారు.

యథేచ్ఛగా నకిలీ పట్టాల సృష్టి

గతంలో ఇక్కడ పని చేసి వెళ్లిపోయిన తహశీల్దార్ల సంతకాలతో నకిలీ పట్టాలు తయారు చేసి, వాటిని యథేచ్ఛగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఇందుకు రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న కొందరు సహకరిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఖాళీ స్థలాలే అక్రమార్కులకు కల్పతరువుగా మారుతున్నాయి.

స్థలం, ప్లాట్ల నెంబర్లు గుర్తింపు

లేఅవుట్‌లో ఖాళీ స్థలం వారే గుర్తించి, ప్లాట్లు నెంబర్లు సైతం వారే వేస్తారు. రికార్డుల్లో ఉండే ప్లాట్ల నెంబర్లను కొందరు రెవెన్యూ అధికారుల సహాయంతో గుర్తించి చివరిగా ఉన్న నెంబర్లు నుంచి ప్లాట్లు నెంబర్లను వేస్తున్నారు. కొందరికి ఇచ్చిన నకిలీ పట్టాల్లో ప్లాట్లు నెంబర్లు సైతం లేకుండా అమ్మేస్తున్నారు. జగనన్న లేఅవుట్‌లో అహుడా నిబంధనల ప్రకారం మంజూరు చేసిన ప్లాట్లు 1004, మధ్యలో కొందరు ప్రజాప్రతినిధుల సిఫాస్సులతో మరో 15 నుంచి 20 మందికి అన్‌లైన్ పట్టాలు మంజూరు చేశారు. ప్రస్తుతం ఈ లేఅవుట్‌లో సుమారుగా 1100 నుంచి 1200 మధ్య పట్టాలున్నట్లు తెలుస్తోంది.

రూ.50వేల నుంచి రూ.లక్ష వసూలు

ఇంటి స్థలం అవసరం ఉన్న అనర్హులను గుర్తించి వారికి మ్యాన్యువల్ పట్టా ఇప్పిస్తామని అందుకు ఖర్చు అవుతుందని దళారుల ద్వారా భేరం పెట్టుతారు. అందుకు ఒప్పుకుంటే ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, ఫోటోలు తీసుకుని కొంత మొత్తాన్ని అడ్వాన్సుగా తీసుకుంటారు. పట్టా ఇచ్చే సమయంలో మిగిలిన నగదు ఇవ్వాలని ముందుగానే ఒప్పందం చేసుకుంటారు. అనంతరం కొన్ని రోజులకు నకిలీ పట్టాలు తయారు చేసి మిగిలిన మొత్తాన్ని తీసుకుంటారు. ఇలా అవసరాన్ని బట్టి రూ.50వేల నుంచి లక్షరూపాయల వరకు వసూలు చేస్తున్నారు. మే నెలలో జగనన్న కాలనీలో కొందరు అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆసమయంలో తహశీల్దార్, మునిఫల్ కమిషనర్లు అక్రమ కట్టాడాలను కూల్చివేశారు. ఆ సమయంలో కొందరు పట్టాలను అధికారులకు చూపగా అవి నకిలీవని అధికారులు తెలిపారు.

ఇళ్లు లేని పేదలకు నిరాశే

అక్రమార్కులు యథేచ్ఛగా ప్రభుత్వ భూములను కాజేస్తున్నారు. అయితే పేదల మాత్రం జానడ స్థలం కోసం నిత్యం రెవెన్యూ కార్యాలయం, సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఇళ్ల లేని నిరుపేదలు రెండేళ్ళుగా ఇంటి పట్టాల మంజూరు కోసం సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తున్నారు. సబ్‌కలెక్టర్, తహశీల్దార్ కార్యాలయాల ముందు ధర్నాలు చేశారు. ఆందోళన సమయంలో కొందరిపై పోలీసు కేసులు కూడా నమోదు అయ్యాయి. పేదల పరిస్థితి ఇలా ఉంటే అక్రమార్కులు మాత్రం ప్రభుత్వ భూమికి నకిలీ పట్టాలు తయారు చేసి అమ్మేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు మాత్రం తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

రెవెన్యూ శాఖలో కనిపించని రికార్డులు

జగన్న లేఅవుట్లలో కొందరు నకిలీ పట్టాలతో పునాదుల తవ్వుకుని ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపట్టుతున్నారు. బహిరంగగనే ఇదంతా జరుగుతున్నా మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు నిమ్మకునీరేత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఎవరైన ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పతారే తప్ప, వారుగా ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. నకిలీ పట్టాలను గుర్తించి రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తే వాటి వివరాలు రెవెన్యూ రికార్డుల్లో ఉండవు. ఈ ఏడాది

పేదలకు ఇళ్ల పట్టాలివ్వండి

పెనుకొండలో ఇళ్ల లేని నిరుపేదలు రెండేళ్లుగా ఇళ్ల పట్టాల కోసం పోరాటం చేస్తున్నారు. వారికి ఇంటి పట్టాలు మంజూరు చేసేలా కొత్త ప్రభుత్వమైనా దృష్టి సారించాలి. ప్రభుత్వ స్థలంలో పేదలు గుడిసెలు వేస్తే వెంటనే అధికారులు వచ్చి వాటిని కూల్చేస్తారు. అక్రమార్కులు నకిలీ పట్టాలతో భవనాలు నిర్మిస్తే ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. నకిలీ పట్టాలపై తాము న్యాయ పోరాటం చేస్తాం.

గంగాధర్, వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

జగనన్న కాలనీలో జరుగుతున్న అవకతవకలపై ఫిర్యాదు చేస్తే పరిశీలించి చర్యలు తీసుంటాం. తాను ఎన్నికల విధుల్లో భాగంగా బదిలీపై వచ్చాను. గతంలో జరిగిన విషయలు తనకు తెలియదు.

ఉదయశంకరరాజు, తహశీల్దార్.



తహశీల్దార్ కార్యాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్ అపూర్వ భరత్

తహశీల్దార్ కార్యాలయాల తనిఖీ

లేపాక్షి : సబ్‌కలెక్టర్ అపూర్వభరత్ గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులు భద్రపరచిన గదిని తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. రికార్డులను భద్రపరిచే గదిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్, తదితర ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని, రాత్రి వేళ ఒకరిని రికార్డు రూమ్ వద్ద కాపలా ఉంచాలని ఆదేశించారు. అలాగే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సబ్ కలెక్టర్ వెంట తహశీల్దార్ బాల నరసింహులు, డిప్యుటీ తహశీల్దార్ కుమార్‌రెడ్డి, సర్వేయర్ కవిత, తదితరులు ఉన్నారు.

సిసి కెమెరా ఏర్పాటు చేయండి

సోమందేపల్లి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రికార్డులు కోసం ఏర్పాటు చేసిన గది వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, అగ్ని ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ తహశీల్దార్ అంజనాదేవిని ఆదేశించారు. సబ్ కలెక్టర్ గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డు గదిని పరిశీలించారు. అలాగు పలు జాగ్రత్తలను సూచించారు. రికార్డు రూమ్ ఎదు రుగా సిసి కెమెరా తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

మంత్రికి 1996-డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల వినతి

గోరంట్ల : న్యాయం చేయాలని కోరుతూ గురువారం 1996-డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ 1996-డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులను మినిమం టైం స్కేల్(ఎంటిఎస్) పద్ధతిలో ఉపాధ్యాయులుగా నియమించాలని కోరామన్నారు. అలాగే వ్యవసాయ, రెవెన్యూ, బిసి సంక్షేమ శాఖల మంత్రులు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, సవితమ్మలను కలిసి న్యాయం చేయాలని వినతి పత్రులు ఇచ్చినట్లు తెలిపారు.

కుమారులకు అంగవైకల్యం

పింఛను మంజూరు చేయాలని తల్లిదండ్రుల వేడుకోలు

ప్రజాశక్తి-లేపాక్షి

లేపాక్షిలో నివాసం ఉంటున్న సూర్యప్రకాష్, మంజులమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు కాగా వారు వికలాంగులు కావడంతో ఇంటికే పరిమితమయ్యారు. ఆ దంపతులు తెలిపిన వివరాలు.. వారికి ఇద్దరు సంతానం కాగా బాబు(16), నరేంద్ర(13) ఏళ్లని, ఇద్దరూ నడవలేరని, మానసిక స్థితి కూడా సరిగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి తల్లి సపర్యలు చేస్తూ ఉంది. తండ్రి పంచాయతీ కార్యాల యంలో దినసరి కూలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వికలాంగులైన ఇద్దరు కుమారులు ఇంటికే పరిమితమయ్యారని, పింఛను మంజూరు చేయాలని కోరుతున్నారు. పింఛను కోసం గతంలో కూడా పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా మంజూరు కాలేదని వాపోయారు. ఇకనైనా అధికారులు స్పందించి వికలాంగ పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని ఆ దంపతులు కోరుతున్నారు.



వికలాంగులైన ఇద్దరు కుమారులతో తల్లిదండ్రులు

జీవో 117 రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-మడకశిర

జీవో నెంబర్ 117ను వెంటనే రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.బూతన్న, నాయకులు జోగప్ప, మహలింగప్ప డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం వారు విలేకరుల సమావే శంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం అమలుచేసిన సంస్కరణల ఫలితంగా రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, దీంతో తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం సడలిపోతుందన్నారు. అలాగే వివిధ మేనేజ్‌మెంట్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పాఠశాల విద్యారంగంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఇన్‌ఛార్జి ఏవో వసుంధరదేవికి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, ఎం.సుధాకర్ నేతృత్వంలో వినతిపత్రం సమర్పించామన్నారు. జీవో నెంబర్ 117 రద్దు, జివో ఎంఎస్ నెంబర్ 53 ప్రకారం టీచర్ల ను కేటాయింపు, ప్రీ ప్రైమరీతో పాటు ఒకటి నుంచి ఐదు తరగతులు ఒకే పాఠశాలగా నడపాలి, రాష్ట్రవ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు, హై స్కూల్స్‌లో రెండు మీడియంలు, బోధనేతర పనుల నుంచి మినహాయింపు, పని భారం తగ్గింపు, నాన్ టీచింగ్ సిబ్బందిని నియామకం, విద్యార్థులకు రవాణా సౌకర్యం, మధ్యాహ్నం భోజనం మెనూ సవరణ, మునిసిపల్ టీచర్ల పీఎఫ్, గిరిజన ప్రాంతాలలో ప్లస్ టు స్కూల్స్ ఏర్పాటు, గిరిజన సంక్షేమ పాఠశాల సిఆర్‌టిలు, భాషా వాలంటీర్ల రెగ్యులర్, కారుణ్య నియామకాలు, పీజీటీలకు జూనియర్ లెక్చరర్ హోదా, ఎంటిఎస్ ఉపాధ్యాయుల సర్వీసు రెగ్యులర్, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు పిఎఫ్ తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సహాధ్యక్షులు బాబు, సీతామహాలక్ష్మి, కోశాధికారి శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్ మారుతిశ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు తాహిర్‌వలి, శి శంకర్, హరికృష్ణ, రమీజాబి, లక్ష్మినారాయణ, నరేష్, సుబ్బారెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ మహంతేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ఏవో కు వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

పాఠశాల స్థలానికి పట్టాదారు పుస్తకం

గుంటిపల్లి గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని గుంటిపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని ఓ ప్రయివేట్ వ్యక్తి పేరు పై పట్టాదారు పుస్తకం, వన్-బి చేయడంతో ఆగ్రహించిన గ్రామస్తులు గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 510/2లో ఒక ఎకరా ప్రభుత్వ పాఠశాల స్థలం, ఇతర రైతులకు చెందిన 11 ఎకరాల భూమి ఉందన్నారు. ఆ భూమిని ఎలాంటి ఆధారాలు లేకుండా కుసుమారపల్లికి చెందిన కొండి నారాయణరెడ్డి పేరుపై పట్టాదారు పుస్తకం, వన్-బి ఎలా చేశారని గ్రామస్తులు, సదరు భూమి హక్కుదారులు తహశీల్దార్ అక్బర్‌బాషాను నిలదీశారు. అక్రమంగా జారీ చేసిన పట్టాదారు పుస్తకాన్ని తక్షణమే రద్దు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించిన తహశీల్దార్ ఈ విషయంపై విచారణ చేసి పాఠశాల స్థలాన్ని, రైతులకు సంబంధించిన భూమిని హక్కుదారులకి చెందేలా వన్-బిని హోల్డ్‌లో ఉంచుతామని తెలిపారు. అలాగే పాఠశాల స్థలంపై అక్రమంగా పట్టాదారు పుస్తకం జారీ చేసిన ఆర్‌ఐ, విఆర్‌ఒలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



తహశీల్దార్ అక్బర్‌బాషాను నిలదీస్తున్న గుంటిపల్లి గ్రామస్తులు



మండల సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

లేపాక్షి : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ వాసుదేవగుప్తా ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ సమాచారం ఇవ్వకుండా గ్రామాల్లో ఇష్టా రాజ్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అధికారుల తీరుపై మండిపడ్డారు. ప్రభుత్వం నిర్వహించే ఏ కార్యక్రమానికి సంబంధించి తమకు సమాచారం ఇవ్వడం లేద న్నారు. మహిళా సంఘాల యానిమేటర్లను ఎవ్వరికీ తెలియకుండా తీసేస్తున్నారని ధ్వజమెత్తారు. చిన్నపాటి ఉద్యుగులపైనా అధికారులు పెత్తనం చెలాయిస్తున్నారన్నారు. యానిమేటర్లను తొలగించడం దారుణమన్నారు. రాబోయే రోజుల్లో ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా ఏ కార్యక్రమం నిర్వహించకూడదన్నారు. సమావేశంలో తహశీల్దార్ బాలనరసింహులు, వైస్ ఎంపీపీలు అంజనరెడ్డి, లీలావతి, ఎంపీటీసీ లలితమ్మ, సర్పంచులు వసుంధర, మంజునాథ్, నాగేంద్ర, ఆదినారాయణ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని సబ్ కలెక్టర్‌కు రైతుల వినతి

సోమందేపల్లి : 40 ఏళ్లుగా భూమి సాగు చేస్తున్నాము.. పట్టాలు, పాసు పుస్తకాలు ఉన్నా వన్-బి రావడం లేదని పలువురు రైతులు గురువారం పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వభరత్‌కు వినతిపత్రం సమర్పించారు. మండలంలోని పోలేపల్లి గ్రామానికి చెందిన 14 మంది రైతులు సుమారు 40 ఏళ్లుగా భూములు సాగు చేసుకుంటూ, బ్యాంకులో రుణాలు సైతం పొందారు. అయితే ఈ ఏడాది రుణాలు రెన్యువల్ చేయడానికి సచివాలయం వెళ్తే వన్-బి రావడం లేదని, తద్వారా తమకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సబ్సిడీ పథకాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే భూమిలో దున్నేందుకు వెళితే కొందరు అడ్డుపడుతున్నారని వాపోయారు. స్పందించిన సబ్ కలెక్టర్ తహశీల్దార్ అంజనా దేవిని పిలిపించి వెంటనే వారి సమస్యను పరిశీలించి న్యాయం చేయాలని ఆదేశించారు. వినతి ఇచ్చిన వారిలో రైతులు అంజనప్ప, నారాయణప్ప, మారెప్ప, మాలక్క, నంజుండప్ప, బుడ్డప్ప, గోవిందప్ప, గంగాధరప్ప, తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ అపూర్వభరత్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

'శాంతినికేతన్' హెచ్‌ఎంకు అవార్డు

పెనుకొండ : పట్టణంలోని శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ హెచ్‌ఎం అరుణ బెస్ట్ ప్రిన్సిపల్ అవార్డుకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ జె.శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. అవార్డుకు ఎంపికైన హెచ్‌ఎం అరుణను గురువారం పాఠశాలలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్నందుకు అరుణకు ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ ముంబయి సంస్థ బెస్ట్ ప్రిన్సిపల్ అవార్డుకు ఎంపిక చేసిందని తెలిపారు. ఈ అవార్డును అరుణకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 5వ తేదీ ప్రదానం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



హెచ్‌ఎం అరుణను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

కబేళాలకు తరలిస్తున్న పశువులు పట్టివేత

గోరంట్ల : రెండు వాహనాల్లో తమిళనాడులోని కబేళాలకు తరలిస్తున్న పశువులను గురువారం మండలంలోని రెడ్డిచెరువుకట్ట వద్ద జనసేన జిల్లా కార్యదర్శి సురేష్, బిజెపి మండల అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, వెంకటాచలం అడ్డుకున్నారు. సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పశువులను, వాహనాలను స్టేషన్‌కు తరలించారు. పశువులను అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన, బిజెపి నాయకులు డిమాండ్ చేశారు.

28న గుండె వైద్యశిబిరం

సోమందేపల్లి : సత్యసాయి ఆశీస్సులతో ఈ నెల 28వ తేదీ మండలంలోని వెలదడకల గ్రామంలోని కాశీవిశ్వనాథ ఆలయంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వెలదడకల శ్రీసత్యసాయి భజన మండలి సభ్యులు తెలిపారు. వారు మాట్లాడుతూ సోమందేపల్లి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే శిబిరంలో అనంతపురంలోని కిమ్స్ సవేరా ఆసుపత్రి వైద్యులు గుండె సంబంధిత పరీక్షలను ఉచితంగా చేస్తారన్నారు. మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

మడకశిర రూరల్ : మండలంలోని కె.గుండుమల గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ మద్దిలేటి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అదేరోజు అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు. వివరాలకు 98666 31403, 91820 40704 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఘనంగా అనంతశక్తి సొసైటీ వార్షికోత్సవం

రొద్దం : టింబక్టివ్ కలెక్టివ్ సహకారంతో ఏర్పాటైన 'అనంతశక్తి సొసైటీ' 25వ వార్షికోత్సవ మహాసభను గురువారం సొసైటీ కార్యాలయంలో సిఈఓ లావణ్య ఆధ్వర్యంలో తహసీన్‌బి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. సమావేశంలో వార్షిక నివేదిక, ఆర్థిక లావాదేవీలు, పాలకవర్గంలో మార్పులు, చేర్పులు చేపట్టినట్లు తెలిపారు. అలాగే పాలక వర్గ సభ్యులను సిబ్బంది ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా టింబక్టివ్ కలెక్టివ్ ప్రతినిధులు మేరీ వట మట్టం, బబ్లూ గంగోలి హాజరై మాట్లాడారు. సంస్థ ప్రారంభ దశలో మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, న్యాయపరంగా చాలా వెనుకబడి ఉండేవార న్నారు. ప్రస్తుతం ఒక్కో మెట్టు ఎక్కుతూ మహిళలు అన్ని రంగాల్లో ప్రవేశించి రాణిస్తున్నా రన్నారు. ఇంకా అనేక సమస్యలున్నాయని, వాటిని అధిగమిస్తూ మహిళలు కలిసికట్టుగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. పిల్లలు చేసిన చెక్కభజన, నృత్యాలు చూపరులను ఆకట్టుకొన్నాయి. కార్యక్రమంలో మేనేజర్లు రమ, సుకన్య, మహాశక్తి సిఈఓ రమీజా, సిబ్బంది, పాలకవర్గం, సొసైటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



సొసైటీ పాలక వర్గ సభ్యులను సన్మానిస్తున్న సిబ్బంది

రూ.2కోట్లకు టోకరా..!

◆నమ్మించి ఉడాయించిన ఆగంతకుడు ◆పోలీసులను ఆశ్రయించిన బాధితులు

ప్రజాశక్తి - నల్లచెరువు

రెండు స్కార్పియో వాహనాలతో పెద్ద ధనవంతుడులా ఫోజులిస్తూ ఓ ఆగంతకుడు మండలంలోకి ఎంట్రీ ఇచ్చాడు. స్థానికంగా ఉన్న కొంతమంది నాయకులతో స్నేహం చేశాడు. వ్యాపారిగా ప్రజలతో పరిచయం పెంచుకున్నాడు. ఇబ్బందుల్లో ఉన్నవారికి సాయం చేస్తూ గుర్తింపు పొందాడు. ఈ నేపథ్యంలో అత్యవసరమని కొంతమంది వద్ద అధిక వడ్డీకి అప్పు తీసుకుని గడువులోగా చెల్లించాడు. దీంతో అతడిని మంచి వ్యక్తిగా ప్రజలు నమ్మారు. ఆ సమయంలోనే ఆ ఆగంతకుడు తన పథకాన్ని అమలు చేశాడు. ఒకరికి తెలియకుండా మరొకరితో పెద్దమొత్తంలో అప్పు తీసుకున్నాడు. గ్రామీణ ప్రజలతో నమ్మకంగా ఉండి గొర్రెల కాపరుల నుంచి గొర్రెలు కొనుగోలు చేశాడు. అప్పులు ఇచ్చిన వారికి తెలియకుండా గొర్రెలు, నగదుతో ఉడాయించాడు. తీసుకున్న అప్పు, గొర్రెలు, బంగారం ఇలా దాదాపు రూ. 2కోట్ల వరకు మోసం చేసి అదృశ్యమయ్యాడు. ఆగంతకుడు చేసిన మోసాన్ని తెలుసుకున్న ప్రజలు లబోదిబో మన్నారు. తమకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటన సత్యసాయి జిల్లాలోని నల్లచెరువు మండలంలో జరిగింది. ఈఘటనకు సంబందించి బాధితులు తెలిపిన వివరాలు...

నల్లచెరువు మండలంలోకి మూడు నెలల క్రితం ఒక వ్యక్తి రెండు స్కార్పియోలతో ప్రవేశించాడు. తన పేరు మహేశ్వరరెడ్డి అని తాను చక్కెర , సిగరెట్లు హోల్ సేల్ ధరలకు సరఫరా చేస్తానంటూ నమ్మించి మండల కేంద్రంలో దుకాణం ఏర్పాటు చేశాడు. ఈసందర్భంగా పలువురితో పరిచయం పెంచుకున్నాడు. ఈ సందర్భంగా మహేశ్వరరెడ్డి తాను ఏప్రాంతం వాడు, తన చిరునామా తదితర విషయాలు తెలియకుండా జాగ్రత్తపడ్డాడు. అదే విధంగా మహేశ్వరరెడ్డి అనే పేరుతో నకిలీ ఆధార్ కార్డు సృష్టించుకున్నాడు. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉన్న కొంతమంది వివిధ పార్టీలకు చెందిన నాయకులతో స్నేహం ఏర్పరచుకున్నాడు. తాను పెద్దమొత్తంలో డబ్బు ఉన్న వ్యక్తిగా పరిచయం ఏర్పరచుకుని ఎవరైనా ఇబ్బందుల్లో ఉంటే వారికి సాయం చేశాడు. గొర్రెల కాపరుల నుంచి గొర్రెలు కొనుగోలు చేసి విక్రయించి వారికి డబ్బులు ఇచ్చాడు. దీంతో మండల ప్రజలు మహేశ్వరరెడ్డిని నమ్మారు. ఈ నేపథ్యంలో మహేశ్వరరెడ్డి మండలంలో డబ్బు ఉండి, అప్పు ఇచ్చే వారిని గుర్తించి వారి వద్ద మరింత చనువుగా ఉండేవాడు. తనకు అత్యవసరమని అధిక వడ్డీకి డబ్బులు అడిగేవాడు. వారు ఇచ్చిన డబ్బులను వడ్డీతో సహా చెల్లించాడు. వారు ఇచ్చిన రూ. 10, రూ. 20 లక్షలకు అధిక వడ్డీ చెల్లించాడు. అధికమొత్తంలో వడ్డీ డబ్బులు వస్తాయని పలువురు భావించి ఒకరికి తెలియకుండా మరొకరు పెద్దమొత్తంలో మహేశ్వరరెడ్డికి ఇచ్చారు. అప్పుడే మహేశ్వరరెడ్డి తన పథకాన్ని అమలు చేశాడు. ఒకరికి తెలియకుండా మరొకరితో పెద్దమొత్తంలో అప్పు తీసుకున్నాడు. పలువురు గొర్రెల కాపరుల నుంచి అప్పుగా గొర్రెలు కొనుగోలు చేశాడు. గ్రామానికి చెందిన గొర్రెల కాపరి ఆదెప్ప వద్ద నుంచి రూ. 9 లక్షలు, రాగన్న గారి పల్లి చెందిన శంకర్‌కు చెందిన రూ.7. 20 లక్షలు , బి వెంకటరమణకి చెందిన రూ.12.45 లక్షలు, టి నరేందర్ రెడ్డి చెందిన రూ. 2 లక్షల, మస్తాన్‌కు చెందిన రూ. 2.40 లక్షలు, వెంకటరావుకు చెందిన రూ. 60వేల విలువైన గొర్రెలను ఒకేసారి అప్పుగా కొనుగోలు చేశాడు. అదే



మహేశ్వరరెడ్డిగా చలామణి అయిన నిందితుడు

సమయంలో తాను ఓ శుభకార్యానికి వెళ్లాల్సి ఉందని బంగారు నగలు కావాలని కొందరితో బంగారు నగలు కూడా తీసుకున్నారు. వాటిని అన్నింటినీ తీసుకుని నాలుగు రోజుల క్రితం ఉడాయించాడు. మహేశ్వరరెడ్డి జాడ మండలంలో కనపడకపోవటంతో బాధితులు ఒక్కొక్కరు బయటకు వచ్చి తమకు జరిగిన మోసాన్ని చెప్పుకున్నారు. అధిక వడ్డీకి నగదు అప్పుగా ఇచ్చిన వారు సైతం తాము ఇచ్చిన మొత్తం, జరిగిన మోసం గురించి బయటపెట్టారు. ఇప్పటివరకు బయటపడిన బాధితుల వివరాల ప్రకారం మహేశ్వరరెడ్డి దాదాపు రూ. 2 కోట్ల వరకు టోకరా వేశాడని తెలుస్తోంది. తమను మోసం చేసి వ్యక్తి ఆచూకి కోసం బాధితులు తమవంతు ప్రయత్నాలు ప్రారంభించారు. పలువురు బాధితులు తమకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారి

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లాలోని అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై పోలీస్ అధికారులు అవగాహన కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. డ్రగ్స్, ర్యాగింగ్ ,గాంజాయి, బ్యాడ్ టచ్, గుడ్ టచ్, సైబర్ నేరాలు వాటి వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. క్రమశిక్షణతో బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఎక్కడైనా పాఠశాలలు కళాశాల సమీపాలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఎస్ఐలు, సిఐలు, పోలీసులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి

ప్రజాశక్తి - కొత్తచెరువు

రైతులు పంటసాగులో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించాలని ఎడిఎలు విద్యావతి, సనావుల్లా తెలిపారు. మండల పరిధిలోని బైరాపురం గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రైతు చిన్ననారప్ప పొలంలో వేరుశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేరుశనగ పంట చుట్టూ కంచెగా నాలుగు రకాల పంటను వేసుకోవాలన్నారు మొక్కజొన్న, జొన్న , సజ్జ, వేయడం ద్వారా రసం పీల్చే పురుగులను అరికట్టవచ్చు అన్నారు. రసం పీల్చే పురుగులు నివారణకు బంతి పువ్వులు, పొద్దుతిరుగుడు, పూల మొక్కలను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు నటరాజు, అబ్దుల్లా అలీ, శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని గుట్ట కింద పల్లి లో గల పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లను నిర్వహిస్తున్నామని ఆ కళాశాల ప్రిన్సిపల్ సురేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి ఉత్తీర్ణత చెందినవారు పాలిసెట్‌లో అర్హత పొందనప్పటికీ స్పాట్ అడ్మిషన్లకు అర్హులని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 29వ తేదీ లోపు తమ దరఖాస్తుతో పాటు సంబంధిత సర్టిఫికెట్ యొక్క జిరాక్స్‌ను జత చేసి కళాశాలలో సమర్పించాలని తెలిపారు. కావలసిన సర్టిఫికెట్లలో పాలిసెట్ 2024 హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, పదవ తరగతి మార్క్స్ కార్డు, పదవ తరగతి టిసి, నాలుగవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఆయా హైస్కూల్ హెడ్మాస్టర్ జారీచేసిన స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రం సమర్పించాలన్నారు. స్పాట్ అడ్మిషన్ కు వచ్చే విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు మూడు సెట్లు జిరాక్స్ తప్పకుండా తీసుకొని రావాలని తెలిపారు. తమకళాశాలలో డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజనీరింగ్, డిప్లమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ కోర్సులు ఉన్నాయన్నారు.

శ్రీనివాస డిగ్రీ కళాశాలకు ఎఐసిటిఇ అనుమతి

ధర్మవరం టౌన్ : పట్టణంలోని సాయి నగర్‌లోగల శ్రీ శ్రీనివాస డిగ్రీ, పీజీకళాశాలలో బిబిఎ, బిసిఎ కోర్సులతోపాటు 2024-25 సంవత్సరానికి ఎఐసిటిఇ కోర్సుకు అనుమతి వచ్చిందని ఆ కళాశాల ప్రిన్సిపల్ మునలిరెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9014219361, 9949206228, 7013145328 కు సంప్రదించాలని కోరారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం : ఎస్పీ



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామని జిల్లా ఎస్పీ రత్న స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రత్న గురువారం పట్టణ పోలీస్ స్టేషను తనిఖీ చేశారు. రికార్డ్ గది, ఖైదీల గది, ఎస్ఐలు గదిని, సిసి కెమెరాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ తమ ప్రథమ కర్తవ్యమని అన్నారు. ఆసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారిస్తామన్నారు. అనంతరం పాత, కొత్త నేరాలకు సంబంధించిన కేసులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో కదిరి డీఎస్పీ శ్రీలత, సిఐలు పుల్లయ్య, వెంకటేశ్వర్లు, మోహన్, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ సెల్వియా సాల్మాన్ పేర్కొన్నారు. స్థానిక ఎన్జీవో హోంలో గురువారం ధర్మవరం సబ్‌డివిజన్ మెడికల్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలతో సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటి డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ప్రజలు పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారులు, మలేరియా సబ్ యూనిట్‌అధికారి జయరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

భవన నిర్మాణ, ఆటో, అసంఘటిత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆసంఘం నాయకులు పైపల్లి గంగాధర్, పెడబల్లి బాబా, పుట్టపర్తి లోని స్థానిక గణేష్ సర్కిల్‌లో విలేకరులతో మాట్లాడుతూ భవన నిర్మాణ, ఆటో , అసంఘటిత రంగ కార్మికులు అభద్రత భావంతో జీవిస్తున్నారన్నారు. వారికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సంబంధించిన 44 చట్టాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నాలుగు కార్మిక కోడ్‌లుగా కుదించి వారి జీవితాలతో చెలగాటమాడుతున్నాయని విమర్శించారు. అధికారం రాకముందు కార్మికులకు ఇచ్చిన హామీలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ, మున్సిపాలిటీ. ఆశ, ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలకు కనీస వేతనం అమలు చేయాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండండి

ప్రజాశక్తి-అమరాపురం

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ జనార్ధననాయుడు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఎస్ఐ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలోని మహిళలు, బాలికల పట్ల గౌరవంగా మెలగాలని సూచించారు. ప్రధానంగా డ్రగ్స్ వంటి దురలవాట్లకు దూరంగా ఉండాల న్నారు. అలాగే ర్యాగింగ్, బాల్యవివాహాలు, రహదారిపై ప్రయాణం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరి దేశానికి సేవ చేసే వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. దురలవాట్లకు దూరంగా ఉంటూ మంచి అలవాట్లను గ్రహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ రామాంజనేయులు, కానిస్టేబుల్ శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో లేబర్ ఆఫీసు ఏర్పాటుచేయాలి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ధర్మవరంలో లేబర్ ఆఫీసు ఏర్పాటుచేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ. రమణ, కో కన్వీనర్ అయూబాఖాన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ధర్మవరం ప్రాంతంలో ఆసంఘటిత కార్మికులు దాదాపు 20వేల మందికి పైగా ఉన్నారని, వారికి సంబందించిన లేబర్ కార్డులను ఏర్పాటు చేసుకోవడం కోసం కార్మికులు అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. గతంలో ధర్మవరంలో లేబర్ ఆఫీసు, లేబర్ కోర్టు ఉండేదని దాని ద్వారా స్థానికంగా వేలాది మంది కార్మికులు వారి సమస్యల కోసం లేబర్ ఆఫీసు వెళ్లేవారని అన్నారు. అయితే సత్యసాయిజిల్లాగా ఏర్పాటైన తరువాత ధర్మవరంలో ఉన్న లేబర్ ఆఫీసును కొత్తచెరువుకు తరలించారన్నారు. అధికారులు కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ధర్మవరంలోనే లేబర్ కార్యాలయం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు రఫీ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

జీవో 117ను రద్దు చేయాలి : యుటిఎఫ్



వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

జీవో 117ను వెంటనే రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపీ జయ చంద్రా రెడ్డి, . సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఏవో వసుంధరదేవికి సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వం అమలు జరిపిన సంస్కరణల ఫలితంగా రాష్ట్ర విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లితండ్రుల విశ్వాసం సడలిపోతోందని వాపోయారు. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి విషమించకముందే ప్రభుత్వం మేల్కొనాలన్నారు. వివిధ మేనేజ్‌మెంట్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలన్నారు. హై స్కూళ్లలో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలని కోరారు. ఒక కిలోమీటరు పైబడి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. అదే విధంగా మునిసిపల్ టీచర్ల పీఎఫ్ సమస్యను వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాలలో ప్లస్ టు స్కూల్స్ ను ఏర్పాటు చేయాలనీ, గిరిజన సంక్షేమ పాఠశాలలో పనిచేస్తున్న సిఆర్‌టిలను, బాషా వాలంటీర్లను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలని కోరారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, సహాధ్యక్షులు బాబు, సీతా మహాలక్ష్మి, కోశాధికారి, శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్ మారుతీ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు తహీర్ వలీ, శివ శంకర్, హరికృష్ణ, రమీజాబీ, లక్ష్మి నారాయణ, నరేష్ ,సుబ్బారెడ్డి జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ మహంతేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడికేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

న్యాయవాది రామస్వామి నాయుడిపై దాడి కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు పట్టణ సిఐ పుల్లయ్య తెలిపారు. నిందితులు పోలినేని శ్రీనివాసులు, రాగిరి జయరాం, కుటాగుళ్ల నాగప్ప, ఆలకుంట్ల పకీరప్పను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ప్రజాశక్తి - ముదిగుబ్బ

స్థానిక వెలుగు కార్యాలయంలో ఎపిఎం హేమలత ఆధ్వర్యంలో విఒఎలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లీడ్ బ్యాంకు మేనేజర్ రమణ కుమార్ మాట్లాడుతూ బ్యాంకులు అందిచే రుణ సౌకర్యాలు , ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన, సుకన్య సమద్ధి యోజన, అటల్ పెన్షన్ యోజన, విశ్వకర్మ యోజన తదితర వాటి గురించి అవగాహన కల్పించారు. బ్యాంకులు మహిళా సంఘాలకు ఇచ్చిన రుణాలను సకాలంలో చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ రవి, వెలుగు సీసీలు, ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్లు జి గోపాల్, మునిరాజ్, విఒఎలు తదితరులు పాల్గొన్నారు.

వారపుసంత స్థలాన్ని మార్చండి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం నిర్వహించే వారపు సంత స్థలాన్ని మార్చాలని సిపిఎం, ఇతర ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సిఐ యతీంద్రకు సమర్పించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద రోడ్డుకు ఇరువైపులా నిర్వహించే వారపు సంత వల్ల వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ సమయంలో పలు ప్రమాదాలు కూడా జరిగాయన్నారు. మార్కెట్ ఆవరణంలో వ్యాపారాలు నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు మండల అధ్యక్షులు బండల వెంకటేష్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బాబు, రంగనాయకులు, గోపీ, నాగేంద్ర, శివ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని సాయినగర్‌లోనిన షిర్డీసాయిబాబా ఆలయంలో పేదలకు, భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో ప్రతి గురువారం ఆలయానికి వచ్చే భక్తులతోపాటు పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి ప్రతినిధులు బందనాథం సూర్యప్రకాశ్, వీరనారాయణ, రాంప్రసాద్, హేమంత్ కుమార్, జీసీనాయుడు, సూర్యనారాయణ, రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.



భోజన సౌకర్యం కల్పిస్తున్న దృశ్యం

ప్రతిభా విద్యార్థులకు చేయూతనందిస్తాం

ప్రజాశక్తి-హిందూపురం

ఆర్థికంగా వెనుకబడి బాగా చదివే విద్యార్థులకు ఉన్నత చదువులకు అవసరమైన సహాయాన్ని అందించడంతో వారికి తమ సంస్థలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని విప్రో హెచ్ఆర్ రామకృష్ణ తెలిపారు. విప్రో కేర్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం హిందూపురం రూరల్ మండలం తూమకుంట, సంతేబిదనూరు జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పదవ తరగతి పూర్తి అయిన అనంతరం ఏలాంటి కోర్సులు చేయాలన్న అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్బంగా విప్రో హెచ్ఆర్ మాట్లాడుతు విప్రో ఫౌండేషన్, యూనివర్సిటీ, అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. అదే విధంగా ఫౌండేషన్ ద్వారా హిందూపురం పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా చదువుతు, ఆర్థికంగా వెనుక బడిన 60 మంది విద్యానులకు ఉపకార వేతనాలు అందిస్తున్నామన్నారు. చదువు పూర్తి అయిన అనంతరం విప్రో పరిశ్రమలో ఇంటర్నషిప్ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే 30 మందికి తమ సంస్థలో ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందన్నారు. అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ ద్వారా ఆడపిల్లలకు అవసరమైన చదువు, అలాగే వివిధ రకాలైన కార్యక్రమాలు, వారి అభివృద్ధికి దేశ వ్యాప్తంగా సుమారు 15వేల మందికి స్కాలర్షిప్స్ ఈ సంవత్సరంలో అందించటం జరిగింది అన్నారు. ఈ ప్రాంత విద్యార్థినులు బాగా చదివితే ఉపకార వేతనాలతో పాటు ఉద్యోగ అవకాశాలు సైతం కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వాసవ్య మహిళా మండలి విప్రో కేర్స్ సహకారంతో నిర్వహిస్తున్న కుశల్ హెల్త్ కేర్ క్లినిక్ సిబ్బంది విజయ్ కుమార్, శిరీష, రమాదేవి, మౌనిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కంపెనీ ప్రతినిధి

రైల్వే అభివృద్ధి కమిటీ సమావేశం


ప్రజాశక్తి కదిరి టౌన్

కదిరి రైల్వే స్టేషన్ నందు స్టేషన్ మాస్టర్ కృష్ణమూర్తి అధ్యక్షతన రైల్వే కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కదిరి రైల్వే కమిటీ చైర్మన్ డిఎల్ ఆంజనేయులు హాజరయ్యారు. ఈ సమావేశంలో పలు సమస్యలను చర్చించారు. స్టేషన్‌లో రైలు ఒక నిమిషం పాటు మాత్రమే నిలుపుతున్నారని ప్రయాణికుల సౌకర్యార్థం ఐదు నిమిషాల వరకు రైతు నిలపాలని కోరారు. అలాగే ప్రయాణికుల వెయిటింగ్ హాల్‌లో కూర్చోవడానికి సౌకర్యాలు కల్పించాలని కోరారు. వికలాంగులకు వీల్ చైర్ ఏర్పాటు చేయాలని, తాగునీటి వసతి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే కమిటీ సభ్యులు మేకల్ నాగార్జున, రియాజ్ మహమ్మద్ తిమ్మరాజు , శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

రికార్డులకు పటిష్ట భద్రత : జేసీ



బత్తలపల్లి తహశీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రతి రికార్డును పటిష్టంగా భద్రపరచాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలోని బత్తలపల్లి, తాడిమర్రి, ధర్మవరం మండలాలలోని రెవెన్యూ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ధర్మవరం ఆర్డీవో కార్యాలయంలోని రికార్డుల గదిని పరిశీలించారు. అనంతరం ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, సిబ్బందితో సమావేశమై విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో కార్యాలయ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. పరిపాలన విధానంపై తగు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ రమేష్, డిటి లక్ష్మీదేవి, తహశీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిలమత్తూరు : అన్ని మండల తహశీల్దార్ కార్యాలయాల్లో సిసి టీవీలు తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలని పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డు రూమును పరిశీలించారు. కార్యాలయంలో సీసీ టీవీ కెమరాలను ఏర్పాటు చేసుకోవాలని తహశీల్దార్ భాగ్యలతను ఆదేశించారు. ఇటీవల మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డు రూం కాలిపోయిన నేపథ్యంలో ఈ జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సబ్ కలెక్టర్ మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని జేసీ అభిషేక్‌కుమార్ ధర్మవరం ఆర్డీవో వెంకటశివరామిరెడ్డితో కలిసి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. కార్యాలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రికార్డు రూము భద్రత గురించి సూచనలు చేశారు. రికార్డు రూము భద్రతపై తహశీల్దార్ శివశంకర్ నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. రాత్రి సమయంలో విధులు నిర్వర్తించేవారు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లుతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సిఎస్ఐటి శారద, ఎఎస్ఒ డాక్టర్ ఏఎస్ఐ డార్టర్ లక్ష్మీనరసింహకర్మ, సీనియర్ అసిస్టెంట్ విజిత, జూనియర్ అసిస్టెంట్ రామాంజినమ్మ. హరికష్ణ, ట్రాన్స్ ఏఈ శివయ్య, కంప్యూటర్ ఆపరేటర్ చక్రపాణి, విఆర్ఎలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.